సాక్షి తిరుపతి

శుక్రవారం । 17 । జనవరి । 2025



బీమా భరోసా ఏదీ?

కూటమి ప్రభుత్వం రైతులకు పంగనామాలు పెడుతోంది. అన్నదాత సుఖీభవ అటుంచి.. ఉచిత పంటల బీమాకూ ఎగనామం పెట్టింది. - 8లో



మైమరిపించే మామండూరు

రేణిగుంట మండలం, శేషాచల అడవుల్లోని మామండూరు పర్యాటక కేంద్రం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. - 8లో



వైభవంగా పార్వేట ఉత్సవం

తుమ్మలగుంటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పార్వేట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

నిర్ణీత సమయంలో వైకుంఠ ద్వార దర్శనం

తిరుమల : భక్తులకు తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం నిర్ణీత సమయంలో జరుగుతోంది. బుధవారం తిరుమల శ్రీవారిని 71,417 మంది దర్శించుకున్నారు. 19,396 మంది తలనీలాలు సమర్పించారు. అదేవిధంగా శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.396 కోట్లు వచ్చింది. వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు కలిగిన భక్తులను మాత్రమే దర్శనానికి అనుమతిస్తారు. టికెట్ లేని భక్తులకు దర్శనం లేదు.

పట్టణంలోకి మూడు రోజులు రావొద్దు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణ కేంద్రంగా నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా ఈనెల 18, 19, 20 తేదీలలో మూడు రోజుల పాటు ప్రయివేట్ బస్సులు పట్టణంలోకి రాకూడదని, అలాగే పట్టణంలో ఎక్కడా పార్కింగ్ చేయరాదని స్థానిక సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లెమింగో ఫెస్టివల్స్‌కు సంబంధించిన బస్సులు మాత్రమే పట్టణం లోపలకు అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. శ్రీసిటీ, మాంబట్టు కంపెనీలకు చెందిన బస్సులు హోలీక్రాస్ సెంటర్ నుంచి షార్‌వై జంక్షన్ దాకా అనుమతిస్తామని తెలిపారు.

20న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

తిరుపతి అర్బన్ : టీటీడీ ఉద్యోగుల సహకార పరపతి సంఘం తిరుపతిలో జనరల్ మేనేజర్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయడానికి 20న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు కిషోర్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు సంస్థ కార్యాలయంలో నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. వారు సహకారశాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రారు లేదా ఆపై కేడర్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసి ఉండాలని, 65 ఏళ్లలోపు ఉండాలని వెల్లడించారు.

దేవతలు.. దీవెనలు..

ముక్కనుమ సంబరం.. కరకంఠేశ్వరుడి ఆహ్వానం.. ద్వాదశ దేవతల ఆగమనం.. అతిథి దేవుళ్లకు ఆతిథ్యం.. పరివట్టంతో గౌరవం.. మార్గం మధ్యలోని పల్లెల్లో రంగవల్లులతో స్వాగతం.. నారికేళ సమర్పణం.. భక్తుల కోలాహలం నడుమ కొండచుట్టు మండపానికి వేంచేపు చేసిన దేవతాగణం.. విద్యుద్దీపాలు, కాగడాల వెలుగుల్లో తరలివచ్చిన 21 మంది దేవతలు భక్తులకు దీవెనలు అందించారు. నగరి పట్టణంలోని కరకంఠేశ్వరస్వామి కొండచుట్టు వైభవం ఇదీ.



నగరిలోని కొండచుట్టు మండపం వద్ద దేవతల సందింపు

- ముక్కనుమకు విచ్చేసిన దేవతలు
- ఊరేగింపుగా వచ్చిన 21 దేవతలతో నెలకొన్న సందడి
- దేదీప్యమానంగా దేవతల సందింపు

ఎదురుకోలు



భక్త జనసందోహం నడుమ కరకంఠేశ్వరస్వామి

వివిధ గ్రామాల నుంచి ట్రాక్టర్లపై వచ్చిన ఉత్సవమూర్తులకు కరకంఠేశ్వర స్వామి ఎదురెళ్లి ఆహ్వానం(ఎదురుకోలు) పలుకగా కొండచుట్టు మండపం వద్దకు చేరి విఘ్నేశ్వరుని దర్శించు కుని సమీప మైదానంలో కొలువుదీరారు.

నగరి : ఉమ్మడి జిల్లాలోనే నగరి పట్టణంలో ముక్కనుమ సందర్భంగా నిర్వహించే కొండచుట్టు ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. మనం బంధువులను పెద్దపండుగకు ఎలా ఆహ్వానిస్తామో.. అలా నగరి పట్టణంలోని కరకంఠేశ్వరస్వామి తన పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లోని దేవతలను ఆహ్వానిస్తారని.. ఆయన ఆహ్వానం మేరకు కొండచుట్టు మండపం వద్దకు విచ్చేసే దేవతలకు కరకంఠేశ్వరస్వామి ఆతిథ్యం ఇచ్చి.. గౌరవించి పంపుతారన్నది ప్రతీతి. ఆనవాయితీ ప్రకారం ఆహ్వానం పంపడంతో ఆ యా ఆలయాల్లో ఉదయం నుంచి దేవతల ఉత్సవమూర్తులకు అలంకరణ ఏర్పాట్లు ప్రారంభించారు. దేవతలకు ఆహ్వానం పలికేందుకు ముందుగా వెళ్లాల్సిన కరకంఠేశ్వర స్వామికి ఉదయం అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించి కొండచుట్టు మండపం వద్దకు వేంచేపు చేశారు.

కర్పూర హారతులు

ఊరేగింపుగా విచ్చేసిన దేవతలకు ఆయా గ్రామాల్లో గ్రామస్తులు దారి పొడవునా రంగవల్లులు దిద్దిదిద్దీ ఆహ్వానించారు. కర్పూర హారతులిచ్చి కొబ్బరి కాయలు కొట్టి దర్శించుకున్నారు.

పోటెత్తిన భక్తులు

రాత్రి కొండచుట్టు మండపం సమీపం ఉన్న మైదానంలో దేవతల సందింపు ఏర్పాటు చేయగా ఆ కమనీయ దృశ్యాన్ని తిలకించేందుకు ప్రజలు పోటెత్తారు.

దేవతల ఆగమనం

కరకంఠేశ్వర స్వామి ఆహ్వానం మేరకు నారాయణ వనంలోని అగస్త్యేశ్వరస్వామి, పరాశురేశ్వరస్వామి, బుగ్గ కాశీవిశ్వేశ్వరస్వామి, పాలమంగళం నుంచి పాశేశ్వరస్వామి, ముడిపల్లి అగస్త్యేశ్వరస్వామి, రాధా రుక్మిణీ, కరింబేడు నాధాశీశ్వరస్వామి, మేళంబాకం రాధాకృష్ణస్వామి నగరి పట్టణానికి విచ్చేశారు. అలాగే మిట్టపాళెం పాశేశ్వరస్వామి, దేశూరు అగరం నుంచి వేణుగోపాలస్వామి, కృష్ణరామాపురం గ్రామం నుంచి శివపార్వతులు, తెరణి వైకుంఠనాథస్వామి, సత్రవాడ చిదంబరేశ్వరస్వామి శివగామి సుందరి, చింతలపట్టెడ శరవణ వినాయక, అగర వినాయక స్వామి, మేళపట్టు పరమేశ్వరుడు, ఎలకాటూరు కృష్ణమూర్తి స్వామి, చవరంబాకం పరమేశ్వరస్వామి, కళియంబాకం కాశేశ్వర స్వామి, జ్ఞానమ్మ పట్టెడ నుంచి మీనాక్షిదేవి, మూలనెత్తం నుంచి ఈశ్వరుడు, వినాయకుడు కొండచుట్టు మండపానికి చేరుకున్నారు.

ఘనంగా వీడ్కోలు

విచ్చేసిన దేవతల తరపున అర్చకులకు కరకంఠేశ్వర ఆలయ అర్చకులు పరివట్టం కట్టి మర్యాదలు చేసి, ఘనంగా వీడ్కోలు పలికారు. ఏకకాలంలో అందరు దేవతలు ఒక్కచోట చేరడం అందరికీ ఒక్కసారిగా హారతి ఇవ్వడం ప్రత్యేక సంతరించుకుంది.



విద్యుత్ దీపాల వెలుగులో కొండచుట్టు మండపం

లక్ష్మణ్, చందులను ఎవరు నియమించారు?

- టీటీడీ ఈఓ, చైర్మన్ల మధ్య విభేదాలున్నాయన్నది 'పచ్చ' పత్రికే
- టీటీడీని భ్రష్టు పట్టిస్తున్న అదనపు ఈఓ
- టీటీడీ మాజీ చైర్మన్ భూమన ఆగ్రహం



భూమన కరుణాకర రెడ్డి

తిరుపతి మంగళం : టీటీడీ సమావేశాల్లో లక్ష్మణ్‌కుమార్, తోట చందు కూర్చునేందుకు ఏమి అర్హతలున్నాయని, వారిని ఎవరు నియమించారో చెప్పాలని..? టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ ఒక వేళ టీటీడీ అభివృద్ధికి ఉపయోగపడేందుకు ఎవరినైనా మేధావులు, అనుభవజ్ఞులను నియమించాలంటే బోర్డు తీర్మానం చేయాలే తప్ప ఎవరికి వారు నియమించడానికి వీల్లేదన్న విషయాన్ని గుర్తుచేశారు. టీటీడీలో జరిగే ప్రతి విషయంలో లక్ష్మణ్‌కుమార్, తోట చందు జోక్యం చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. వారికి అదనపు ఈఓ వెంకటయ్య చౌదరి చాంబర్‌లో ఒక గదిని కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. వారు టీటీడీలో ఇష్టమొచ్చినట్లు టిక్కెట్లు అమ్ముకుంటూ టీటీడీ ప్రతిష్టను దిగజారుస్తున్నారని మండిపడ్డారు.

ఆ పత్రికే మొదట చెప్పింది

టీటీడీ ఈఓ శ్యామలరావు, చైర్మన్ బీఆర్ నాయుడు.. నువ్వెంత అంటే నువ్వెంత అన్న విధంగా వారి మధ్య తీవ్రమైన విభేదాలున్నాయని మొట్టమొదటిగా పత్రికలో రాసింది, అందరికీ తెలియజేసింది టీడీపీ అనుకూల పత్రికే అని టీటీడీ మాజీ చైర్మన్ తెలిపారు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవు అని చెప్పుకుంటున్న మీపైన, ప్రభుత్వంపైన ఇష్టమొచ్చినట్లు రాసిన ఎల్లో మీడియాపై ఇప్పటివరకు కేసులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఇదివరకు సోషల్ మీడియాలో ఏది రాసినా వారిపై వందల కేసులు పెట్టారు కదా?.. ఇప్పుడెందుకు పెట్టలేదని నిలదీశారు. ఆ పత్రికలో చూసే మీ మధ్య విభేదాలున్నాయన్న విషయం అందరితో పాటు తనకూ తెలిసిందని భూమన పేర్కొన్నారు.

పక్షుల పండగ.. సమాచారం ఎక్కడ?

దుస్థితిలో పక్షుల సమాచార కేంద్రం

- పక్షులు గురించి సమాచారం ఇచ్చే వారేరీ?
- మద్యం సేవించే కేంద్రాలుగా మారిన బర్డ్స్ వ్యూ పాయింట్లు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైల్డ్‌లైఫ్ సిబ్బంది



కుదిరి-అటకానితిప్పకు మధ్యలో బర్డ్స్ వ్యూ పాయింట్‌లో బెంచీలను పగులగొట్టిన మందుబాబులు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట–శ్రీహరికోట మార్గంలో కుదిరి వద్ద ఏర్పాటు చేసి పక్షుల సమాచారం కేంద్రం పనిచేసి కొన్ని సంవత్సరాలైంది. పక్షుల సమాచారం కేంద్రంలో సమాచారం ఇచ్చే సిబ్బంది లేకపోవడంతో ఈ భవనం పూర్తిగా శిథిలమైపోయింది. దీంతో ఈ భవనాన్ని మద్యం సేవించేందుకు, పేక ఆడేందుకు, అసాంఘిక కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. విదేశీ వలస విహంగాలు విడిది చేసిన దృశ్యాలను తిలకించేందుకు పులికాట్ వన్యప్రాణి సంరక్షణ విభాగం వారు అక్కడక్కడా గ్రానైట్ రాళ్లతో బెంచీలు ఏర్పాటు చేశారు. ఎండ తగలకుండా నీడను కల్పించేందుకు శ్రీహరికోట రాకెట్ కేంద్రం వారు రేకుల షెడ్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా కుదిరి–అటకానితిప్పకు మధ్య బర్డ్స్ వాచ్ టవర్‌ను కూడా ఏర్పాటు చేశారు. అయితే వైల్డ్‌లైఫ్ వారి పర్యవేక్షణ పూర్తిగా కొరవడడంతో వీటిని మందుబాబులు బార్లుగా ఉపయోగించుకుంటున్నారు. వ్యూపాయింట్లలో బెంచీలను పగులగొట్టి నిలబడడానికి కూడా వీల్లేకుండా తయారు చేశారు. సూళ్లూరుపేట–శ్రీహరికోటకు మధ్యలో ఉన్న అటకానితిప్పలో వైల్డ్‌లైఫ్ వారు పర్యావరణ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారు. దీన్ని సందర్శించేందుకు వచ్చే పర్యాటకులు వ్యూపాయింట్ల వద్ద కూర్చుని పక్షులను వీక్షిస్తూ ఎంజాయ్ చేసేవారు. పులికాట్ సరస్సుకు ఈ సీజన్‌లో సుమారు 152 రకాల విదేశీ, స్వదేశీ విహంగాలు వచ్చాయి. వీటిని వీక్షించేందుకు దేశ విదేశాల నుంచి పర్యాటకులు ఇక్కడకు విచ్చేస్తుంటారు. ఈనెల 18, 19, 20 తేదీలలో ఫ్లెమింగో ఫెస్టివల్–2025 నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ ఈ వ్యూపాయింట్లకు మరమ్మతులు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.



కుదిరి వద్ద శిథిలావస్థకు చేరిన పక్షుల సమాచార కేంద్రం



అటకానితిప్ప-శ్రీహరికోటకు మధ్యలో పిచ్చి మొక్కలతో నిండిన బర్డ్స్ వ్యూ పాయింట్

పేరుకు విధులు, చేసేది సైడ్ బిజినెస్‌లు

సూళ్లూరుపేట కేంద్రంగా నడుస్తున్న వైల్డ్‌లైఫ్‌లో సిబ్బంది కొరత పీడిస్తోంది. బీట్ ఆఫీసర్లుగా వేసిన వారు అక్కడకు వెళ్లి విధులు చేయకుండా సైడ్ బిజినెస్‌లలో లీనమైపోయారు. ఇక్కడ ఒక డీఎఫ్ఓ, రేంజర్ అధికారి ఉండి కూడా ఉపయోగం లేకుండా పోయింది. ఈ రెండు పోస్టులకు దూర ప్రాంతాలకు చెందిన వారిని పంపిస్తుడడంతో వారు ఏదో విజిట్‌కు వచ్చినట్టు వచ్చి వెళ్తున్నారు. కింది స్థాయి సిబ్బంది కూడా సరిగా విధులు నిర్వహించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సరస్సులో గుల్ల తీయడం, వానపాములను తవ్వడం వంటి కార్యకలాపాపై నిఘా కొరవడిపోయింది. ఇందులో ఇంటి దొంగల పాత్ర ఎక్కువగా ఉన్నట్టు సమాచారం.

21న చిత్తూరుకు ఏకసభ్య కమిషన్ చైర్మన్

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ షెడ్యూల్ కులాల్లోని ఉపకుల వర్గీకరణకు సంబంధించి ఏర్పాటు చేసిన శ్రీరాజీవ్ రంజన్ మిశ్రా ఈ నెల 21న చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రానికి విచ్చేయనున్నట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు తమ అభిప్రాయాలను అర్జీల రూపంలో తెలియజేవచ్చని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంటారని ఆయన వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు సూళ్లూరుపేటలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్ తెలిపారు. ఇందులో భాగంగా కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో పురుషులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, మహిళలకు త్రోబాల్, టెన్నికాయిట్ క్రీడల్లో, అలాగే అండర్–15 బాలురకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడల్లో హోలీ క్రాస్ హైస్కూల్ ఆవరణలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు తిరుపతి జిల్లాకు చెందిన వారే అర్హులని, ఆసక్తి గల వారు 17వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆధారు కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 93470 38584, 99660 81144, 90596 06346 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

వచ్చేనెల 15 వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు



రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఆర్టీఓ మురళీకృష్ణ



అలిపిరి డిపోలో మాట్లాడుతున్న డీపీటీఓ నరసింహులు

తిరుపతి అర్బన్: రోడ్డు భద్రత మాసోత్సవాలు వచ్చే నెల 15 వరకు నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ద్వారా వచ్చే ప్రమాదాలపై పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ మురళీకృష్ణ, ఎంవీఐ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. అలాగే అలిపిరి ఆర్టీసీ డిపోలో జరిగిన కార్యక్రమంలో డీపీటీఓ నరసింహులు పాల్గొని ప్రసంగించారు. ప్రతి డ్రైవర్ ప్రమాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. తిరుమల ఘాట్‌లో ఓవర్ టేకింగ్ చేయడం మంచిది కాదని చెప్పారు. అలాగే తిరుమలలో శ్రీకాళహస్తి, పుత్తూరు డిపోలకు చెందిన పలువురు డ్రైవర్లు రోడ్డుకు అడ్డదిడంగా సర్వీసులను నిలుపుదల చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఏవైనా ఇబ్బందులుంటే అలిపిరి డిపో టోల్‌గేట్ నెంబర్ 928117115కు చెప్పాలను సూచించారు. డిపో మేనేజర్ హరిబాబుతోపాటు అధికారులు రాజశేఖర్, పురుషోత్తం, ప్రభాకర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు. అలాగే తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని గ్యారేజ్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాలు చేపట్టారు. డీఎం బాలాజీ, ఏటీఎం డీఆర్ నాయుడుతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఏటి పండుగ



బుల్లితెర నటుల హాస్యవల్లరి



ఏటి పండుగలో కిక్కిరిసిన జనం

నాయుడుపేట టౌన్ : సంక్రాంతిని పురస్కరించుకుని నాయుడుపేట స్వర్ణముఖి నదిలో జరుగుతున్న ఏటి పండుగకు జనం పోటెత్తారు. రెండో రోజు అయిన గురువారం ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఉప్పొంగిపోయారు. పట్టణం నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వేలాది మంది హాజరయ్యారు. నదివద్ద చిన్ననాటి స్నేహితుల పలకరింపులు, కొత్తగా పెళ్లయిన యువజంటల కేరింతలు, మహిళల ఆట పాటలతో సందడి చేశారు. చిన్నారులు పోటాపోటీగా గాలిపటాలను ఎగురవేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో సీఐ బాబి, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా

ఈ ఏడాది ఏటి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రజలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. గురువారం నిస్సీ ఈవెంట్స్‌కు చెందిన మేర్లపాక హరి ఆర్గనైజేషన్ వారి కార్యక్రమాలతోపాటు ప్రముఖ యాంకర్లు, బుల్లితెర నటులు విచ్చేసి సందడి చేశారు. స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మోటార్ సైకిల్ దొంగల అరెస్ట్

– రూ.15 లక్షల విలువ చేసే 13 మోటార్ సైకిళ్లు స్వాధీనం

తిరుపతి క్రైం : నగరంలో మోటార్ సైకిల్ దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ తెలిపారు. గురువారం వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాలు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులు హాస్పిటల్ సమీపంలోని వివేకానంద సర్కిల్ వద్ద ఉన్నట్టు సమాచారం వచ్చిందన్నారు. వారిని వెస్ట్ సీఐ మురళీమోహన్, సిబ్బంది చాకచక్యంగా అరెస్ట్ చేశారన్నారు. విచారణలో వారు అనంతపురం జిల్లా కదిరికి చెందిన పఠాన్ సాహిద్ బాషా, పఠాన్ ఇమ్రాన్ బాషాగా గుర్తించామన్నారు. వీరు వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత ఏడాది ఆగస్టులో పార్కింగ్ ప్రదేశంలో ఉంచిన వాహనాలను దొంగలించినట్లు గుర్తించామన్నారు. వీరు వద్ద నుంచి రూ.15 లక్షల విలువ చేసే 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ కేసులో మరో ముద్దాయి అన్న మహేందర్ నాయక్ గత ఏడాదిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నారు.

ఎస్ఎస్‌డీ టోకెన్లపై సమీక్ష

తిరుమల: వైకుంఠ ద్వార దర్శనం ఎస్ఎస్‌డీ టోకెన్లపై గురువారం సాయంత్రం ఉన్నతాధికారులతో టీటీడీ ఈఓ శ్యామలరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. జనవరి 19న వైకుంఠ ద్వార దర్శనం ముగుస్తున్నందున ఎస్ఎస్‌డీ టోకెన్లపై అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం, కలెక్టర్ డాఎస్. వెంకటేశ్వర్, ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి సమీక్షించారు. జీమ్ ఐటీ శేషారెడ్డి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, వీజీఓ సదాలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి స్కూల్‌లో అంబేడ్కర్ ఫొటో పెట్టాలి

చిత్తూరు కలెక్టరేట్ : గణతంత్ర దినోత్సవం రోజున ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అంబేడ్కర్ ఫొటో పెట్టించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కోరారు.

మామండూరు అటవీక్షేత్రం ప్రధాన భవనం(ఫైల్)



పెద్దేరు వాగునీటిలో జలకాలాట



పెద్దేరు వాగుకు వెళ్లే బావికాడ లైను మార్గం



మైమరిపించే మామండూరు

పక్షుల కిలకిలరావాలు.. సెలయేటి పరవళ్లు.. ఆకాశన్నంటేలా అబ్బురపరిచే వృక్షాలు.. స్వచ్ఛమైన పిల్లగాలులు.. మనసును ఉల్లాసపరిచే ప్రకృతి అందాలు.. మైమరిపించే వాతావరణంలో పర్యాటకుల స్వర్గధామంగా ఆకట్టుకుంటోంది మామండూరు టూరిజం కేంద్రం. నిత్యం పెద్దసంఖ్యలో తరలివచ్చే సందర్శకులతో విలసిల్లుతోంది. ముఖ్యంగా వారాంతపు రోజుల్లో వేలాదిమందికి ఆహ్లాదం పంచుతోంది. పేదల ఊటీగా అభివృద్ధి పథంలో పయనిస్తోంది.

- ఆహ్లాదం పంచే అటవీ అందాలు
- మంత్రముగ్ధం చేసే ప్రకృతి సొబగులు
- సేదతీరేందుకు పెద్దేరు జలసిరులు
- పర్యాటకుల విడిదికి ప్రత్యేకంగా గదులు
- చిన్నారులు ఆడుకునేందుకు పరికరాలు
- అభివృద్ధి పథంలో ఎకో టూరిజం కేంద్రం

రేణిగుంట: రేణిగుంట మండలం శేషాచల అడవుల్లోని మామండూరు పర్యాటక కేంద్రం ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎకో టూరిజం ప్రాజెక్టు ద్వారా మామండూరును ఆధునిక వసతులతో తీర్చిదిద్దు తున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలతో నిత్యం బిజీ బిజీగా ఉండే వారు సరదాగా ఓ రోజు కుటుంబ సభ్యులతో గడిపేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాక పక్క జిల్లాలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ప్రధానంగా వీకెండ్ సమయంలో రోజూ సుమారు 2వేల మందికిపైగా మామండూరుకు చేరుకుంటున్నారు. ఇక్కడే వంట చేసుకుని విందు, వినోదాలతో సందడి చేస్తున్నారు.

అందుబాటులో విడిది గృహాలు

ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న మామండూరు పర్యాటక క్షేత్రంలో సందర్శకుల బస కోసం ఐదు విడిది గృహాలు, ఒక డార్మెటరీ నిర్మించారు. వసతి గృహాలకు కటక, గుంజన, తుంబుర, హరిణి, మయూర నదుల పేర్లు పెట్టారు. వీటికి ఇటీవల మరమ్మతు చేయించి, అధునాతన హంగులు సమకూర్చారు. అయితే ఇక్కడ బస చేయాలంటే పర్యాటకులు ముందుగానే ఆన్‌లైన్‌లో గదులను బుక్ చేసుకోవాలి. వీటితోపాటు డైనింగ్ హాలు, హట్స్, పిల్లలు ఆడుకోడానికి ప్రత్యేకంగా ఆట వస్తువులతో చిల్డ్రన్స్ పార్క్ కూడా ఏర్పాటు చేశారు. బ్రిటీష్ కాలం నాటి ప్రధాన భవనాన్ని ఆధునిక వసతులతో పునర్నిర్మిస్తున్నారు. కొండమీదకు వెళ్లే రెండు మార్గాలకు ఫుట్‌పాత్‌లను కొత్తగా నిర్మించారు.

రెండు దారులు ఇవే..

అటవీ శాఖ ఎకో టూరిజం గుట్ట నుంచి బావికాడ లైను మార్గం, వాచ్ టవర్ వ్యూ పాయింట్ మీదుగా గుంటి మడుగు వరకు దారులు ఉన్నాయి. దట్టమైన అడవిలోని ఈ మార్గాల్లో వెళుతుంటే దుప్పులు జింకల మందలు కనువిందు చేస్తాయి. అలాగే జంగిల్ సఫారీ వాహనం కూడా సిద్ధం చేశారు.



చిల్డ్రన్స్ ప్లే పార్క్

వాగునీటిలో జలకాలాట



శేషాచలంలోని పవిత్ర తీర్థాలు నుంచి వచ్చే జలాలతో పెద్దేరు వాగు కళకళలాడుతూ ఉంటుంది. పర్యాటక కేంద్రం ప్రధాన భవనం నుంచి బావికాడ లైను మార్గంలో సుమారు 2 కిలో మీటర్లు నడిచి వెళితే పెద్దేరు వాగుకు చేరుకుంటారు. నడిచి వెళ్లే మార్గంలో పెద్దపెద్ద వృక్షాలు, వెదురు పొదలు ఆకట్టుకుంటాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా పెద్దేరు వాగులో స్నానాలు చేసి ఆనందిస్తుంటారు. వాగులో ప్రమాదాలు జరగకుండా ఫారెస్ట్ అధికారులు లోతైన ప్రాంతాల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి పర్యవేక్షణకు వాచర్లను సైతం ఏర్పాటు చేశారు.

ఎలా చేరుకోవాలంటే..

తిరుపతి నుంచి కరకంబాడి మీదుగా కడప మార్గంలో 12 కిలోమీటర్లు ప్రయాణిస్తే, మామండూరు గ్రామం వస్తుంది. అక్కడ నుంచి తూర్పు వైపు అటవీ ప్రాంతంలో ఒక కిలోమీటర్ వెళితే ఎకో టూరిజం పర్యాటక కేంద్రానికి చేరుకోవచ్చు. తిరుపతి నుంచి 23 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. రేణిగుంట నుంచి కడప మార్గంలో కూడా ఇక్కడకు వెళ్లవచ్చు. ఆర్టీసీ బస్సులు సైతం ఈ మార్గంలో నడుస్తున్నాయి.

చూడదగ్గ ప్రదేశం



మా కుటుంబంతో కలసి కడప నుంచి శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వెళుతూ మామండూరు ఫారెస్ట్ బాగుంటుందని తెలిసి మొదటిసారిగా వచ్చా. ఊటీ, కొడైకెనాల్‌కు ఏ మాత్రం తీసిపోని విధంగా ఇక్కడ ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. ట్రెక్కింగ్, జలపాతాలు, ప్రకృతి సిద్ధ అటవీ వృక్షజాలం చూడముచ్చటగా ఉన్నాయి. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా వచ్చి చూడదగ్గ ప్రదేశం మామండూరు.

– కిరణ్ కుమార్, కడప, వైఎస్సార్ జిల్లా

మరచిపోలేని రోజు



మేం యూట్యూబ్‌లో మామండూరు గురించి తెలుసుకుని కుటుంబంతో కలిసి వచ్చాం. అనుకున్న దానికంటే ఇక్కడ చాలా బాగుంది. పిల్లలు కూడా సంతోషంగా గడిపే వాతావరణం ఉంది. కలసి పెద్దేరు వాగునీటిలో స్నానం చేశాం. ఇంటి నుంచి తెచ్చుకున్న ఆహారం అడవిలోనే తిన్నాం. ఈ విహార యాత్ర మాకు ఎంతో మధురానుభూతిని మిగిల్చింది. మాకు మరచిపోలేని రోజు ఇది.

– హాసిని, భానుప్రియ, తిరుపతి

ఈసారి ఫ్యామిలీతో వస్తా



మామండూరుకు తొలిసారి స్నేహితులతో కలసి వచ్చా. సహజసిద్ధ అటవీ ప్రకృతి అందాలు మనసుకు హత్తుకునేలా ఉన్నాయి. పిల్లలను తీసుకొస్తే చాలా బాగా ఎంజాయ్ చేస్తారు. పిల్లల కోసం చిల్డ్రన్స్ పార్క్ కూడా ఏర్పాటు చేశారు. ఈసారి కచ్చితంగా ఫ్యామిలీతోనే వస్తా. – కమల్, చెన్నై, తమిళనాడు

సంతోషంగా గడపొచ్చు



నేను పదేళ్లుగా రేణిగుంట రైల్వేలో లోకోపైలెట్‌గా పనిచేస్తున్నా. మామండూరు గురించి చాలా రోజులుగా వింటున్నా. తొలిసారి కుటుంబ సమేతంగా వచ్చా. విడిది గృహాలు, ట్రెక్కింగ్, జలపాతాలు గొప్ప అనుభూతినిచ్చాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ వచ్చి ఇక్కడ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించవచ్చు. – ఉమేష్‌చౌదరి, లోకోపైలెట్, రేణిగుంట

మరింత అభివృద్ధి చేస్తాం



మామండూరు ఎకో టూరిజం కేంద్రంలో గదులను అధునాతన హంగులతో తీర్చిదిద్దాం. ఫుట్‌పాత్‌లను నిర్మించాం. ఇక్కడ మద్యం తాగడంపై నిషేధం విధించాం. బావికాడ లైను మార్గం పనులు జరుగుతున్నాయి. వేసవి నాటికి వ్యూ టవర్ పాయింట్, గుంటిమడుగు వరకు పర్యాటకులను తీసుకెళ్లేందుకు జంగిల్ సఫారీ వాహనం కూడా సిద్ధం చేశాం. పెరుగుతున్న పర్యాటకుల సంఖ్య మేరకు మామండూరును మరింత అభివృద్ధి చేస్తాం. – షేక్ గౌస్‌కరీం, డీఆర్ఓ, మామండూరు

రోడ్డు నిర్మిస్తాం



మామండూరు పర్యాటక కేంద్రానికి నిత్యం పెద్దసంఖ్యలో సందర్శకులు వస్తున్నారు. మామండూరు గ్రామం నుంచి ఫారెస్ట్ స్పాట్‌కు రోడ్డును నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఎమ్మెల్యే సహకారం తీసుకుని త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతాం. – కుమారస్వామి, వీఎస్ఎస్ చైర్మన్, మామండూరు

శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ ఇస్తున్న జర్మన్ భాష ప్రత్యేక నిపుణులు

తిరుపతి అర్బన్: జర్మన్ దేశంలో ఉద్యోగ, ఉపాధి కోసం నెల రోజుల క్రితం దరఖాస్తులు చేసుకున్న జనరల్ నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు గురువారం నుంచి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్ఎం క్యార్ సొల్యూషన్ సీఎంబీహెచ్ చెన్నైకి చెందిన సీఈఓ నటరాజన్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం ఆధ్వర్యంలో స్విమ్స్ నర్సింగ్ కళాశాలలో ఉదయం నుంచి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్న బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. 18–35 ఏళ్ల మధ్య ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. స్విమ్స్ నర్సింగ్ కళాశాలలో ఆరు నెలల పాటు జర్మన్ భాషలో ఏ1, ఏ2, బీ1, బీ2 పై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. అదనపు సమాచారం కోసం 9988853335 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. స్విమ్స్ కో–ఆర్డినేటర్ నాగేంద్రమ్మ, ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది దీప, సాయిలక్ష్మి, దిలీప్ పాల్గొన్నారు.

చర్చిలో విదేశీయులు



వెంకటగిరి లూథరన్ చర్చి వద్ద విదేశీయులు

వెంకటగిరి రూరల్ : ఏసుక్రీస్తు మార్గంలో పయనించి ప్రజలకు సేవ చేయాలని అమెరికన్, జర్మనీ దేశస్తులు అభిప్రాయపడ్డారు. వారు గురువారం తిరుపతికి చెందిన సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చి ఆధ్వర్యంలో వెంకటగిరిలోని పలు చర్చిలను పరిశీలించారు. చర్చి సంఘాలు అక్కడ చేస్తున్న సువార్త కార్యక్రమాలపై ఆరా తీశారు. వందేళ్ల క్రితం వెంకటగిరి ప్రాంతంలో సువార్తను చాటిన అమెరికన్ సువార్తీకుడు స్టీవ్ సమాధి వద్ద ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నార్త్ ఈస్టన్ మినిస్ట్రీ సైనోడ్ ఈఎల్‌టీఏ బిషప్, అమే, ఓడిగ్రేస్, ఈఎల్‌పీఏ చాంపియన్ ప్రోగ్రామ్ డైరెక్టర్ ఆలీసోమరిథాడ్, ఈఎల్‌సీఏ పాస్టర్ రెవరెండ్ ఎలీనా, గోమలక, తిరుపతి సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చి బిషప్ విజయభాస్కర్, వైస్ ప్రెసిడెంట్ కేపీ లూథర్‌బాబు, ఎల్ఎల్‌సీ కార్యదర్శి కేజే ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా వెళ్లండి



తిరుపతిలోని శ్రీహరి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీని క్రమబద్ధీకరిస్తున్న డీపీటీఓ నరసింహులు

తిరుపతి అర్బన్: సంక్రాంతి పండుగ పూర్తయిన నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు విచ్చేసిన వారంతా తిరుగు ప్రయాణమైన వారితో గురువారం తిరుపతి సెంట్రల్ బస్టాండ్ కిటకిటలాడింది. రద్దీ సమాచారం తెలుసుకున్న జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీఓ) నరసింహులు తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిధిలోని శ్రీహరి, శ్రీనివాస, పల్లెవెలుగు బస్టాండ్లలో రెండు గంటల పాటు పర్యవేక్షించారు. జాగ్రత్తగా వెళ్లండి...అంతా క్యూ పద్ధతి పాటించాలంటూ ఉద్యోగులతో కలిసి ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూశారు. కార్యాలయానికే పరిమితం కాకుండా రోజూ ఆయన వివిధ సమస్యలపై దృష్టి పెడుతున్నారు.

ఇస్రో విజయంపై శ్రీసిటీ ఎండీ అభినందనలు



రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ (వరదయ్యపాళెం): స్పేస్ డాకింగ్ ప్రయోగం (స్పేడెక్స్) విజయవంతం కావడంపై శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆయన గురువారం ఒక ప్రకటనలో ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, ఇస్రో బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంతరిక్షంలో ఉపగ్రహాల అనుసంధానం చేయగల సత్తా కలిగిన 4వ దేశంగా భారతదేశాన్ని నిలపడం గర్వంగా ఉందని తెలిపారు. ఈ విజయాన్ని అందించిన ఇస్రో బృందం కృషి, అంకితభావం శ్లాఘనీయమని వెల్లడించారు. అంతరిక్ష పరిశోధనల పురోగతిలో భారతీయ శాస్త్రవేత్తల అసాధారణ నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తూ స్పేస్ డాకింగ్‌లో ఇస్రో సాధించిన విజయం మనందరికి గర్వకారణమని తెలిపారు. ఇస్రో విజయపరంపర నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.

తుమ్మలగుంటలో.. వైభవంగా పార్వేట ఉత్సవం



తుమ్మలగుంటలో కళ్యాణ వెంకన్న పార్వేట ఉత్సవంలో ఆలయ ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అర్చకులు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వెంకన్న పార్వేట ఉత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఒక తిరుచ్చిలో శ్రీ మలయప్పస్వామి, మరో తిరుచ్చిలో శ్రీకృష్ణస్వామి వేంచేయగా.. పార్వేట మండపంలో పుణ్యాహవచనం, ఆరాధన, నివేదన చేసి హారతులు ఇచ్చారు. అనంతరం శ్రీకృష్ణస్వామి వారిని సన్నిధి యాదవ పూజ చేసిన చోటుకు తీసుకెళ్లి పాలు, వెన్న, హారతులు సమర్పించారు. ఆ తర్వాత కల్యాణ వెంకన్న స్వామి వారు కొంత దూరము పరుగెత్తగా.. ఆయన తరఫున అర్చకులు బాణమువేసిన తర్వాత వెనక్కి వచ్చారు. ఇలా మూడు సార్లు చేశారు. ఆ తర్వాత తిరిగి ప్రధాన ఆలయం వద్దకు ఉత్సవ మూర్తులను తీసుకురావడంతో పార్వేట ఉత్సవం ముగిసింది. ఈ ఉత్సవంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, లక్ష్మీ దంపతులు హాజరయ్యారు.

సుప్రభాత సేవ పునః ప్రారంభం

ధనుర్మాస కాలం మంగళవారం ముగియడంతో బుధవారం నుంచి శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సుప్రభాత సేవ పునఃప్రారంభమైంది. గత ఏడాది డిసెంబర్ 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు ఆలయంలో సుప్రభాతం స్థానంలో గోదా తిరుప్పావై పారాయణం జరిగిన విషయం విదితమే. సరిగ్గా నెల రోజుల విరామమం తర్వాత సుప్రభాతసేవ పునఃప్రారంభం కావడం విశేషం.

బీమా భరోసా ఏదీ?



- పంటకు బీమా చెల్లింపునకు ముగిసిన గడువు
- కేవలం ఒకటి నుంచి మూడు శాతం మందే చెల్లింపు
- గత సర్కారులో వంద శాతం ఉచితం
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కో పంటకు ఒక్కో ప్రీమియం
- దిక్కుతోచని స్థితిలో రైతులు

పంట రకం	సాగు ఎకరాల్లో	బీమా కట్టింది ఎకరాల్లో
వరి	2,24,037.5	7,251
వేరుశెనగ	4,813	54
మామిడి	55,125	552

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం అన్నదాతను నట్టేట ముంచేసింది. ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ, ఉచిత పంటల బీమా అంటూ కల్లబొల్లి మాటలు చెప్పింది. గద్దెనెక్కినాక అన్నింటికీ పంగనామాలు పెట్టింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు సంబంధించిన పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని భరించింది. ఉచితంగా పంటల బీమా చెల్లించి భరోసా కల్పించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పంటల బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించాలంటూ కొత్త మెలిక పెట్టింది. దీనిపై కొందరికి అవగాహన లేకపోవడంతో జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి మూడు శాతం మందే బీమా చెల్లించినట్టు అధికార యంత్రాంగం పేర్కొంది.

ముగిసిన గడువు

జిల్లా వ్యాప్తంగా రబీలో 2,24,037 ఎకరాల్లో వరి సాగుచేయగా.. 4,813 ఎకరాల్లో వేరుశనగ సాగులో ఉంది. 55,125 ఎకరాల్లో మామిడి పంట సాగవుతోంది. ఈ పంటలకు బీమా కట్టడానికి గురువారంతో గడువు ముగిసింది. వరి ఎకరాకు రూ.630, వేరుశనగకు రూ.450, మామిడికి రూ.1,750 చెల్లించాల్సి ఉంది. అయితే గతంలో టీడీపీ ప్రభుత్వం బీమా ప్రీమియం కట్టించుకున్నప్పటికీ పరిహారం ఇవ్వకపోవడంతో రైతులు ఈ సారి దీనిపై పెద్దగా ఆసక్తి చూపలేదు. జిల్లా వ్యాప్తంగా వరికి సంబంధించి కేవలం 3.23 శాతం, వేరుశనగకు 1.12 శాతం, మామిడి పంటకు 1 శాతం మంది మాత్రమే బీమా చెల్లించినట్టు అధికారులు చెబుతున్నారు.


కూటమి ప్రభుత్వం కొత్త మెలికలు

రబీకి సంబంధించి బీమాకు నగదు నమోదు చేసుకున్నా.. ఒక్కో పంటకు ఒక్కో రకంగా నిబంధనలు పెట్టింది. గత ఐదేళ్లలో ఏ ప్రాంతంలో ఎక్కువగా, ఎంత మేర నష్టం వచ్చిందో దానికి అనుగుణంగా బీమా చెల్లిస్తామని పేర్కొంది. ఈ క్రమంలో బీమా నగదు కట్టినా, నష్టం వాటిల్లినా ఇచ్చేది ఉండదనే నిర్ధారణతో రైతులు ముందుకు రాలేదని సమాచారం.

గత సర్కార్‌లో ఉచిత బీమా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులు సాగు చేసిన వరి, వేరుశనగ, మామిడి పంటలకు ఉచితంగా బీమా చెల్లించింది. పంట నష్టం వాటిల్లితే టంచన్‌గా పరిహారం పంపిణీ చేసింది. అయితే కూటమి ప్రభుత్వం బీమా ప్రీమియం కట్టిన రైతులకు మాత్రమే పరిహారం అంటూ కొత్త రూల్స్ పెట్టింది.


తక్కువ మంది రైతులే కట్టారు



రబీకి సంబంధించి పంట నష్టం జరిగితే బీమా పొందడానికి చెల్లించాల్సిన ప్రీమియానికి గురువారంతో గడువు ముగిసింది. ఈ సారి తక్కువ మంది రైతులు బీమా కట్టారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పంట నష్టం జరిగితే వారికి చెల్లిస్తాం. ఒక వేళ మళ్లీ బీమా కట్టడానికి గడువు పెంచితే సమాచారం ఇస్తాం. ప్రస్తుతానికి బీమాకు ఇక అవకాశం లేదు.

–ఎస్. ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

సద్వినియోగం చేసుకోలేదు



మామిడి పంటకు బీమా కట్టడానికి గడువు ముగిసింది. జిల్లాలో ఇప్పటి వరకు 552 ఎకరాల్లో సాగుచేసిన మామిడికి మాత్రమే రైతులు బీమా కట్టారు. 50 రోజుల పాటు గడువు ఇచ్చారు. అయితే రైతులు పూర్తిగా సద్వినియోగం చేసుకోలేదు.

–దశరథరామిరెడ్డి, ఉద్యానశాఖ జిల్లా అధికారి